

దరఖాస్తులను స్వీకరిస్తున్న నోడల్ అధికారి దివ్య

ప్రజావాణికి 277 ఫిర్యాదులు

బేగంపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 277 ఫిర్యాదులు అందాయి. ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ఫిర్యాదులను స్వీకరించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 42, విద్యుత్ శాఖకు 36, రెవెన్యూకు 45, హోంశాఖకు 14, మున్సిపల్ శాఖకు 14, ఇందిరమ్మ ఇళ్ల కోసం 75, ఇతర శాఖలకు సంబంధించి 51 ఫిర్యాదులు అందినట్లు ప్రజావాణి అధికారులు తెలిపారు.



వెంకటగిరిలో రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గుంతల రోడ్లకు మరమ్మతులు

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షానికి వెంకటగిరి, శ్రీకృష్ణ నగర్ ఏ, బీ బ్లాక్‌లతో పాటు పలు బస్తీల్లో దెబ్బతిన్న రహదారులకు జీహెచ్‌ఎంసీ రెండు రోజులుగా మరమ్మతులు చేస్తున్నారు. మంగళవారం వెంకటగిరిలో చేస్తున్న పనులను బీజేపీ సీనియర్ నాయకులు బరిగెల జ్ఞానేశ్వర్, పులిరాం, బడుగు సతీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు బస్తీల్లో రోడ్లు ధ్వంసమైన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌కుమార్ మాదిగ

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

పంజాగుట్ట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ పరిధిలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సంవత్సరాల తరబడి ఒకేచోట తిష్టవేసిన చైన్ మెన్లు, సిబ్బందిని బదిలీ చేయాలని దళిత చైతన్య సంఘం అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులు మధుసూదన్ మాదిగ, శేషాద్రిలతో కలిసి ఆయన మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో పట్టణ ప్రణాళిక విభాగంలో కిందిస్థాయి సిబ్బంది, చైన్‌మెన్‌లు సంవత్సరాల తరబడి ఒకేచోట పనిచేస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులు, సిబ్బందిపై అవినీతి నిరోధక శాఖ, ఆదాయపన్ను శాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సహజీవనం చేసి ముఖం చాటేసిన యువకుడిపై కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతితో సహజీవనం చేసి మోసం చేసిన యువకుడిపై కేసు నమోదైంది. విశాఖ పట్నానికి చెందిన యువతి గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 10లో స్నేహితులతో కలిసి ఉంటుంది. అదే కంపెనీలో పనిచేస్తున్న కర్నూలుకు చెందిన బత్తుల సాకేత్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నాడు. కొద్ది రోజుల తర్వాత ప్రతి రోజూ మద్యం తాగి వచ్చి యువతిని శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. బెల్టుతో కొట్టడం, మత్తు దిగాక తప్పయిందంటూ కాళ్లు పట్టుకునేవాడు. గత ఏడాది ఫిబ్రవరిలో సాకేత్ స్నేహితులు మహేందర్, జయంత్ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఈ విషయాన్ని సాకేత్‌కు చెప్పగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ ఏడాది జనవరిలో ఆఫీస్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటుండటంతో సాకేత్‌ను నిలదీయగా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాకేత్ తల్లిదండ్రులను అడగ్గా వారు కూడా తమకు తెలియదని చెప్పారు. యువతి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు సాకేత్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంపై అసత్య ప్రచారం చేస్తున్న యూట్యూబర్‌పై కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సీఎం ప్రతిష్ఠను దిగజార్చేలా యూట్యూబ్‌లో ప్రసారం చేసిన నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నబంర్ 14 వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన శంకర్ ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 7న సోయి లేని ముఖ్యమంత్రి పేరుతో సీఎం రేవంత్‌రెడ్డిపై ఓ కథనం ప్రసారం చేశాడు. ఇది వాస్తవానికి దూరంగా ఉందని, సీఎం ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉందని పరమేశ్ యాదవ్ అనే వ్యక్తి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యూట్యూబర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో కోరాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక రోగిపై వైద్యులు దాడి చేశారని ఫిర్యాదు

బంజారాహిల్స్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మానసిక రోగి అయిన తన సోదరుడిపై వైద్యులు, సిబ్బంది దాడి చేసి తీవ్రంగా గాయపర్చారని ఏఎస్‌ఐ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేసే మహ్మద్ వాహెద్ అలీ మానసికంగా ఇబ్బంది పడుతున్న తన సోదరుడు మహ్మద్ హమీద్‌ను కొద్ది రోజుల క్రితం బంజారాహిల్స్‌లోని ఆశా హాస్పిటల్‌లో అడ్మిట్ చేశాడు. ఈ నెల 7న ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ మోనిక ఫోన్ చేసి హమీద్ ఆసుపత్రి రూల్స్‌ను అధిగమిస్తున్నాడని చెప్పింది. ఈ మేరకు వాహెద్ ఆసుపత్రికి వెళ్లగా హమీద్ నొప్పులతో ఇబ్బంది పడుతూ కనిపించాడు. వాపులు కనిపించడంతో సీసీ కెమెరా ఫుటేజీ చూపించాలని అడిగాడు. దీనికి ఆసుపత్రి నిర్వాహకులు నిరాకరించారు. దీంతో ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు తన సోదరుడిపై దాడి చేశారని వాహెద్ ఫిర్యాదు చేయడంతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడి మృతి



సత్యనారాయణ

బేగంపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బేగంపేటకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సి. సత్యనారాయణ గుండె పోటుతో మృతి చెందారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే రూ.4.5 లక్షల ఖర్చు అవుతుందని చెప్పడంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేయించేందుకు నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. నిమ్స్‌లో పరీక్షలు నిర్వహిస్తుండగా మరోసారి గుండె నొప్పి రావడంతో మృతిచెందినట్లు సత్యనారాయణ కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మోడల్ కాలనీలో సమస్యల తిష్ట

- వంద శాతం ట్యాక్స్ పేయర్లున్న కాలనీగా గుర్తింపు
- అయినా సమస్యలతో ఇబ్బందులు
- రోడ్డు నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురుచూపులు
- కమ్యూనిటీహాల్ అభివృద్ధి చేయాలని స్థానికుల విజ్ఞప్తి
- ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు

బేగంపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు అసోసియేషన్‌గా ఏర్పడి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేసవిలో పేదలకు పెరుగన్నం, మజ్జిగ పంపిణీ చేయడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు, వారి సహాయకులకు తరచూ ఆహారం అందిస్తున్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, వంద శాతం ట్యాక్స్ పేయర్లు ఉన్న కాలనీలో నెలకొన్న సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని సనత్‌నగర్‌లోని మోడల్ కాలనీ వాసులు విమర్శిస్తున్నారు. రోడ్డు నిర్మాణం, పార్క్‌లో వాచ్‌మెన్ రూమ్ నిర్మాణం కోసం సంవత్సరాలుగా ప్రజాప్రతినిధులకు, జీహెచ్‌ఎంసీ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు చెబుతున్నారు.

నిధులు మంజూరైనా లేని ప్రయోజనం..

మోడల్ కాలనీ నుంచి కేఎల్ఎన్ యాదవ్ పార్క్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. గుంతలు పడటంతో పాటు కంకర తేలి ప్రజలకు అసౌకర్యంగా మారింది. కాలనీవాసులు అధికంగా రాక పోకలు సాగించే రహదారి కావడంతో దీనిని వీడీసీసీ రోడ్డుగా నిర్మించాలని కోరుతూ స్థానికులు పలు మార్లు ప్రజాప్రతినిధులను కోరారు. దీంతో గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న తలసాని శ్రీనివాస్‌యాదవ్ బీటీ రోడ్డు స్థానంలో వీడీసీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు రూ.80 లక్షలు మంజూరు చేయించారు. అనంతరం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించే లోపే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో అప్పటి నుంచి రోడ్డు పనులు అటకెక్కాయి. ఈ విషయంపై కాలనీ వాసులు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులను కలిసి రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. అయితే గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం కోసం మంజూరు చేసిన నిధులు ఆగిపోవడంతో పనులు ఆగిపోయాయని అధికారులు కాలనీ వాసులకు చెప్పినట్లు తెలిసింది.

కమ్యూనిటీహాల్‌లో అదనపు గది కోసం..

సీనియర్ సిటిజన్లకు వసతి కోసం కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో అదనపు గది నిర్మాణంతో పాటు పార్క్‌లో వాచ్‌మెన్ రూమ్ నిర్మాణం చేపట్టాలని కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పలుమార్లు అధికారులకు విన్నవించారు. దీంతో అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ సుమారు రూ.20 లక్షల నిధులను మంజూరు చేయించారు. అయితే ప్రభుత్వం మారడంతో ఈ పనులకు కేటాయించిన నిధులు సైతం నిలిచిపోయాయి. వీటి నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు చేయాలని ఇటీవల కాలనీవాసులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. నీలిమను కలిసి వినతిపత్రం అందజేశారు.



మోడల్ కాలనీలో వీడీసీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన రహదారి

సమస్యలను పరిష్కరించాలి



మోడల్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. రహదారి అధ్వానంగా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పార్క్‌లో వాకింగ్‌కు వెళ్లే సీనియర్ సిటిజన్స్ ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఎక్కువ శాతం పచ్చదనంగా ఉంటుంది. పార్క్ సంరక్షణ కోసం వాచ్‌మెన్ గదిని పునరుద్ధరించాలి. కమ్యూనిటీహాల్ అదనపు గది నిర్మాణం చేపట్టాలి.

- జేఎస్టీ సాయి, కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు



మాట్లాడుతున్న అబ్దుల్ మజీద్ షోయబ్

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాం

- జేఐహెచ్ ఉపాధ్యక్షుడు షోయబ్

పంజాగుట్ట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ జమాతే ఇస్లామి హింద్ (జేఐహెచ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ మజీద్ షోయబ్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ కార్యదర్శి డాక్టర్ ఉస్మాన్, ఫక్రుద్దీన్, మీడియా విభాగం కార్యదర్శి జయాముద్దీన్ అహ్మద్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టం వివక్షతతో కూడుకున్నదని, ఇది మతపరమైన ఆస్తులను సంరక్షించడంలో స్వయం ప్రతిపత్తిని హరిస్తుందన్నారు. అనేక రాష్ట్రాలు హిందూ, సిక్కు ఎండోమెంట్‌ల కోసం ప్రత్యేకమైన చట్టాలను కలిగి ఉన్నాయని, పర్యవేక్షణ అధికారులు సంబంధిత మతాలకు చెందినవారు మాత్రమే ఉంటారని గుర్తు చేశారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను సభ్యులుగా చేర్చడం వల్ల సమస్య పరిష్కారం కాదని.. వాస్తవానికి వక్ఫ్ వ్యవహారాల్లో అవినీతికి ప్రధాన కారణం రాజకీయ జోక్యమేనని ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లును వ్యతిరేకించిన అన్ని పార్టీలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యుడు జియాఉద్దీన్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతున్నాం

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతున్నామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ ఎన్‌బీటీ నగర్‌లో మహిళల కోసం నిర్మిస్తున్న మహిళా భవన్ నిర్మాణ పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరంలో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. మహిళా భవన్ పనులను నెల రోజుల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మహిళా భవన్ పనులను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి



డాగి విల్లేను ప్రారంభించిన అనంతరం మూగ జీవాలతో చంద్రబోస్ తదితరులు

మూగజీవాలు అత్యంత ఆత్మీయ నేస్తాలు

- సినీ గేయ రచయిత చంద్రబోస్

బంజారాహిల్స్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మూగజీవాలు అత్యంత ఆత్మీయ నేస్తాలని, అవి నిస్వార్థంగా ప్రేమిస్తాయని సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 11లో ఏర్పాటు చేసిన అత్యాధునిక డాగి విల్లేను ఆయన వ్యవస్థాపకురాలు అమృత వర్షిణితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ.. ఇక్కడి డాగి విల్లేలో శునకాలు స్వేచ్ఛగా విహరించే వాతావరణం ఉందన్నారు. శునకం పరిమాణం, వయస్సు, స్వభావాన్ని బట్టి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం ప్రశంసనీయమన్నారు. డాగ్ విల్లే వ్యవస్థాపకురాలు అమృత వర్షిణి మాట్లాడుతూ.. డాగి విల్లేలో కేజ్-ఫ్రీ బోర్డింగ్, డేకేర్, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, స్పా, బిహేవియర్ థెరపీ, డాగ్ బోర్డింగ్, గ్రూమింగ్, డాగ్ వాకర్, స్పా వంటి అనేక రకాల సేవలు అందిస్తున్నామన్నారు.

గోర్ బోలి భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలి

- గోర్ జీవన్ పరిరక్షణ సమితి నేతల డిమాండ్

పంజాగుట్ట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలో మొదటిసారిగా గిరిజనులు, లంబాడీలు మాట్లాడే గోర్ బోలి భాషను గుర్తిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, మద్దతు తెలిపిన పార్టీలకు గోర్ జీవన్ పరిరక్షణ సమితి కృతజ్ఞతలు తెలిపింది. దేశంలో 12 కోట్ల మంది గిరిజనులు, లంబాడీలు మాట్లాడే గోర్ బోలి భాషను కేంద్ర ప్రభుత్వం 8వ షెడ్యూల్‌లో చేర్చి అధికార భాషగా గుర్తించాలని సమితి మేనేజింగ్ ట్రస్టీ ఎస్‌కే రాంచందర్ నాయక్, ట్రస్టీ రాములు నాయక్, మాజీ డీజీపీ డాక్టర్ డీటీ నాయక్ తదితరులు కోరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. తమ భాషకు లిపి కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు. భాషతోనే తమ సంస్కృతి అభివృద్ధి చెందిందని.. తమది ఇండో-యూరోపియన్ భాష అన్నారు. ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులను కలిసి ఏపీ అసెంబ్లీలో సైతం తీర్మానం చేయాలని వినతిపత్రం అందజేయనున్నట్లు రాంచందర్ నాయక్ తెలిపారు. హరికిషన్, ప్రసాద్ నాయక్, గిరిజన శక్తి అధ్యక్షుడు వెంకటేష్ చౌహాన్, వంశీ నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డీటీ నాయక్, రాంచందర్ నాయక్ తదితరులు

వెటర్నరీ డాక్టర్‌కు రూ. 1.79లక్షలు టోపీ

- ఆర్మీ డాగ్స్‌కు వైద్యం చేయాలంటూ బురిడీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆర్మీడాగ్స్‌కు వైద్యం చేయాలంటూ నగరానికి చెందిన వెటర్నరీ డాక్టర్‌ను బురిడీ కొట్టించి రూ.1.79లక్షలు సైబర్ క్రిమినల్స్ కొల్లగొట్టారు. ఆ తర్వాత మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన వెటర్నరీ డాక్టర్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తనను తాను ఆర్మీ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. 'మా వద్ద ఆర్మీకి చెందిన 90 కుక్కలు ఉన్నాయి. వాటికి టీకాలు సహా.. అవసరమైన వైద్య పరీక్షలు చేయాల్సి ఉంటుంది. అందుకు అవసరమైన డబ్బును మేమే చెల్లిస్తాం..' అంటూ నమ్మించాడు. మీ ప్రొఫైల్ నచ్చిందని, ఇకపై మీరే మా కుక్కలకు వెటర్నరీ డాక్టర్ అని నమ్మబలికాడు. అయితే, ఆర్మీ నిబంధనల ప్రకారం.. మీకు చెల్లించాల్సిన డబ్బులో 50 శాతం ముందుగానే చెల్లించాల్సి ఉన్నందున పంపిస్తామంటూ వీడియోకాల్ చేసి నమ్మించాడు. మొదట మీరు కొంత నగదు బదిలీ చేయాలని, లావాదేవీ సరిగా ఉందని తేలితే మొత్తం డబ్బులు చెల్లిస్తామని నమ్మబలికాడు. అలా అతని ద్వారా డబ్బులు చెల్లింపులు చేసుకొని, అతని క్రెడిట్ కార్డులోని రూ.1.79లక్షలు కొల్లగొట్టాడు. ఎంతకీ డబ్బు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాత పింఛన్ విధానాన్ని ప్రకటించాలి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ పథకం (ఓపీఎస్)ను ప్రకటించే వరకు దశలవారీగా పోరాటాలకు సిద్ధం కావాలని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి సంఘం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నగరంలో మంగళవారం పీటీఏ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం..

ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా కె.మల్లికార్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శారద, రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శిగా శౌరి, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పార్థసారథి, ప్రభాకర్, చీఫ్ ప్యాట్రన్లుగా కేఎస్ ప్రకాష్‌రావు, బద్రీ నారాయణరావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కాగా, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా వరలక్ష్మి, కార్యదర్శిగా బబితాకుమారి, కోఆర్డినేటర్‌గా లావణ్య, నేషనల్ కౌన్సిలర్‌గా విక్రంభాయిని ఎన్నుకున్నారు.

ఏడాదిలో రూ.2,752 కోట్లు విడుదల

- పదేళ్లలో బీఆర్‌ఎస్ ఇచ్చింది రూ.3,652 కోట్లు మాత్రమే
- మేయర్ విజయలక్ష్మి



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్‌ఎంసీకి రూ.2,752 కోట్లు విడుదల చేసిందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో 2014 నుంచి 2023 వరకు రూ.3,652.71 కోట్ల నిధులు విడుదల చేశారని తెలిపారు. ఇందులో రాష్ట్ర ఆర్థిక కార్పొరేషన్ గ్రాంట్లు రూ.1,415.39 కోట్లు, స్టాంప్ డ్యూటీ రూ.1,776.53 కోట్లు, బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో రూ.460.79 కోట్లు విడుదల చేశారన్నారు. ప్రస్తుత సర్కారు 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్‌ఎంసీకి రూ.6,045 కోట్లు కేటాయించగా.. రూ.2,752 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇందులో బడ్జెట్‌లో కేటాయించిన రూ.2,965.61 కోట్లలో రూ.1552.52 కోట్లు, స్టాంప్ డ్యూటీ రూ.1150 కోట్లు, ఆర్థిక కమిషన్ గ్రాంట్లు రూ.49.36 కోట్లు ఉన్నాయన్నారు.

ఏఐసీసీ సమావేశాలకు హాజరుకానున్న కోట నీలిమ

బేగంపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మలికార్జున్ ఖర్గే ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీల్లో జరిగే ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సమావేశాలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ హాజరుకానున్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం అహ్మదాబాద్ బయలుదేరి వెళ్లారు. అన్ని రాష్ట్రాల్లో పార్టీ పటిష్టత, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు నీలిమ తెలిపారు.

ఉపాధ్యాయురాలిని వేధిస్తున్న ఇద్దరిపై కేసు

అమీర్‌పేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయురాలిపై అభ్యంతరకరమైన వీడియోను వైరల్ చేసిన ఇద్దరిపై ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మెదక్ జిల్లా రామాయంపేట్‌కు చెందిన వర్షిణి టీవీ నిర్వాహకుడు నరేందర్, చిలుకా గంగాధర్ ఎస్ఆర్ నగర్ కు చెందిన ప్రభుత్వ టీచర్‌పై అభ్యంతరకరమైన వీడియో తయారు చేసి వైరల్ చేస్తున్నారు. 25 ఏళ్ల క్రితం గంగాధర్ ఆమెను ఇబ్బంది పెట్టడంతో గతంలో రామాయంపేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, 2001లో టీచర్‌కు వివాహమైన తర్వాత కూడా ఇబ్బందులు పెట్టడంతో అప్పుడు కూడా అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ కేసు మెదక్ కోర్టులో ఉండగా పెద్ద మనుషుల సమక్షంలో రాజీ కుదిరింది. మరోసారి ఆమె జోలికి వెళ్లనని గంగాధర్ అంగీకరించాడు. దాంతో ఆమె కేసును ఉపసంహరించుకున్నారు. అయితే ఇటీవల మళ్లీ అభ్యంతరకరమైన వీడియో వైరల్ చేసి వేధింపులకు పాల్పడుతుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కెవి ప్లేగ్రౌండ్, డీకే రోడ్, శాంతిబాగ్ ఫీడర్ల పరిధిలోని శీష్‌మహల్ థియేటర్, ప్లేగ్రౌండ్, దివ్యశక్తి లైన్, డీకే రోడ్, రోశయ్య లైన్, శివబాగ్, శాంతి బాగ్, కేకే జోన్ హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

నేటి నుంచి భవాని అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని మిథిలానగర్ రోడ్డులో ఉన్న శృంగేరి శారదాపీఠ పరిపాలిత భవాని శంకర, గణపతి, ఆంజనేయస్వామి సహిత నవగ్రహాల ఆలయంలో భవాని(పార్వతి) అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఈ నెల 9 నుంచి మొదలు కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే వేడుకలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధి వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ప్రతిరోజూ అన్నదానం ఉంటుందన్నారు.

రామకృష్ణారావును సీఎస్‌గా నియమించొద్దు

- ఏఐసీసీ మాజీ సభ్యుడు బక్క జడ్సన్

పంజాగుట్ట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నిష్పక్షపాతంగా పనిచేసే సీనియర్ అధికారిని నియమించాలని సామాజిక కార్యకర్త, ఏఐసీసీ మాజీ సభ్యుడు బక్క జడ్సన్ డిమాండ్ చేశారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును సీఎస్‌గా నియమించొద్దని, ఆయనపై ఎన్నో అవినీతి ఆరోపణలు ఉన్నాయన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రామకృష్ణారావు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్షీణించడానికి కారకుడని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు రాష్ట్రంలో అసమర్థ పాలన నడుస్తోందని, మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని మండిపడ్డారు. హైడ్రా పేరుతో ఇళ్లు కూల్చివేస్తున్నారని, హెచ్‌సీయూలో జంతువులకు నీడ లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవం కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో గౌరవం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రామకృష్ణారావును సీఎస్‌గా ఆమోదించే ముందు ఆయన సర్వీస్ రికార్డ్, పరిపాలన, నైతిక ప్రవర్తనపై సమగ్ర విచారణ జరపాలని కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సామాజిక కార్యకర్త గిరిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బక్క జడ్సన్

అవగాహనతోనే రాజ్యాంగ పరిరక్షణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): సామాన్యులు, ముఖ్యంగా యువతీ, యువకులు, విద్యార్థుల్లో రాజ్యాంగంపై తప్పనిసరిగా అవగాహన కల్పించాలని, అప్పుడే దాని స్ఫూర్తిని కాపాడుకోగలమని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా ఎవరివాటా వారికి అందజేసి సామాజిక, ఆర్థిక అసమానతలను నిర్మూలించడానికి ప్రయత్నాలు సాగించాలని ఆకాంక్షించారు. దళిత స్త్రీశక్తి ఆధ్వర్యంలో మంగళవారం 'రాజ్యాంగ పరిరక్షణ - భవిష్యత్ ప్రణాళిక' అంశంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి బి.ఎమ్ వినోద్‌కుమార్, ఆంధ్రమహిళా సభ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ వసుంధరా దేవి, ప్రొ. రజిత, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ కొండవీటి సత్యవతి, కృష్ణకుమారి తదితరులు మాట్లాడుతూ.. రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించుకోవడంలో పౌరుల పాత్ర ప్రధానం అన్నారు. కుల, మత, వర్గ వైషమ్యాలకు అతీతంగా సమాజంలో శాంతి, సామరస్యాలు, వర్ధిల్లాలంటే రాజ్యాంగమే శరణ్యమని వక్తలు నొక్కిచెప్పారు.

కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ కొనసాగుతోంది

- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి చాముండేశ్వరి



ఇంటర్వ్యూ

కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. ప్రజాపాలన, ప్రజావాణి, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ కొనసాగుతోంది. సిబ్బంది కార్డు దారుల ఇళ్లకు వెళ్లి అడ్రస్‌లను పరిశీలిస్తున్నారు. తర్వాత వీటిని ఆన్‌లైన్ చేస్తాం. అలాగే సన్నబియ్యం పంపిణీ తదితర అంశాలపై ప్రజలకు తెలియజేయస్తున్నాం. సికింద్రాబాద్ సర్కిల్ 9 అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి చాముండేశ్వరి మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి పలు విషయాలను వెల్లడించారు.

- రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి)

సికింద్రాబాద్ 9 సర్కిల్ పరిధిలో రేషన్ దుకాణాలు, కార్డుల సంఖ్య ఎంత?

సికింద్రాబాద్ 9 సర్కిల్ పరిధిలో 53 రేషన్ దుకాణాలు, ఏఎఫ్ఎస్‌సీ కార్డులు 4,721, ఎఫ్ఎస్‌సీ కార్డులు 49,066, అన్నపూర్ణ అంత్యోదయ కార్డులు 6 కలిపి మొత్తం 53,793 ఉన్నాయి.

కొత్త రేషన్ కార్డుల పరిస్థితి ఏంటి?

ఏసీఎస్‌ఓ- కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ కొనసాగుతోంది. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి అడ్రస్‌ల పరిశీల చేస్తున్నాం. ఇది పూర్తి అయిన తర్వాత వాటిని ఆన్‌లైన్ చేస్తున్నాం.

మల్కాజ్‌గిరి మేడ్చల్ జిల్లాలో సన్నబియ్యం పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో ఎప్పుడు పంపిణీ చేస్తారు.

ఏప్రిల్‌లో సన్న బియ్య స్టాక్ రేషన్ షాపులకు సరఫరా చేశాం. ఎన్నికల కోడ్‌వల్ల పంపిణీ చేయలేదు. కోడ్ ముగియగానే పంపిణీ చేస్తాం.

రేషన్ దుకాణాల్లో బియ్యంతో పాటు కిరాణ సరుకులు కొనాలని ఒత్తిడి చేస్తున్నారు. దీనిపై మీ స్పందన?

రేషన్ దుకాణాల నెం-903,986లో కేంద్రం నిబంధనల ప్రకారం పోషక విలువలు కలిగిన ఉత్పత్తులు అందించాలని ఉంది. కనుక కిరాణ సరుకులు అమ్ముకునేలా నిబంధన ఉంది. మిగతా షాపులలో అలాంటి నిబంధన ఏమీ లేదు.

రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చా?

చేసుకోవచ్చు

కార్డులలో పేర్ల తొలిగింపు, చేర్చడం ఎలా సాగుతోంది.

సర్కిల్ పరిధిలో కార్డులలో ఉన్న 3,180 మంది పేర్లను తొలిగించాం. కొత్త పేర్లను చేర్చడం కొనసాగుతుంది.

ఫోర్ విల్లర్ కొంటే రేషన్ కార్డు తొలిగిస్తారనే విషయం నిజమేనా?

అవును, ఆధార్ లింకు ద్వారా ఫోర్‌విల్లర్ కొనుగోలు చేస్తే తెలిసిపోతుంది.

మృతురాలి కుమార్తెకు రూ.6.79 లక్షల చెక్కు



చెక్కు అందజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు స్వామి, డైరెక్టర్లు

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో షేర్ హోల్డర్‌గా ఉండి మృతి చెందిన కుటుంబానికి సొసైటీ ఆర్థిక చేయూత అందించింది. సొసైటీలో షేర్ హోల్డర్‌గా ఉన్న పద్మారాణి మృతి చెందగా ఆమె తీసుకున్న లోన్ అమౌంట్ మొత్తం మాఫీ అయింది. ఆమెకు రావాల్సిన ఎమ్‌బీఎఫ్ అమౌంట్ రూ.6,79,947 చెక్కును మంగళవారం సికింద్రాబాద్ సొసైటీ కార్యాలయంలో పద్మారాణికి నామీనిగా ఉన్న కూతురు రమ్యశ్రీకి సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి, డైరెక్టర్లు ఓ.వై.స్వామి, లాలియ నాయక్ అందజేశారు. కార్యక్రమంలో సీసీఎస్ సెక్రటరీ రవి శంకర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా జయ ముదిరాజ్



పుస్తకాల కవిత నుంచి నియామక పత్రం అందుకుంటున్న శీలం జయ ముదిరాజ్

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాంగోపాల్‌పేట్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా శీలం జయ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీత రావు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత నుంచి నియామక పత్రం అందుకున్నారు. అనంతరం సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమను మర్యాద పూర్వకంగా కలిసి తన నియామక పత్రాన్ని చూపి ఆమె ఆశీసులు తీసుకున్నారు. ఈసందర్భంగా శీలం జయ ముదిరాజ్ మాట్లాడుతూ.. తాను 2002లో కాంగ్రెస్ పార్టీలో చేరి గ్రేటర్ హైదరాబాద్ మహిళా కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా పనిచేశానని, నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీని వీడకుండా ఉన్నానన్నారు. తనపై నమ్మకంతో సునీత రావు, పుస్తకాల కవిత ఈ బాధ్యతను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



మైనర్‌బాలుడికి కౌన్సిలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

బౌద్ధనగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మైనార్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దని చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆలుగడ్డబావిలో మైనార్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 18సంవత్సరాల లోపు ఉండి వాహనాలు నడుపుతున్న మైనర్ బాలురకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యాజమానుల డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆర్టీఏ వారితో రద్దు చేయిస్తామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పేలిన విద్యుత్ ఫ్యూజ్ బాక్స్‌లు

- వీసిన ఈదురు గాలులు.. ఏర్పడిన నిప్పురవ్వలు
- కాలి బూడిదైన బాక్స్‌లు
- తప్పిన పెను ప్రమాదం





కాలి బూడిదైన విద్యుత్ ఫ్యూజ్ బాక్స్‌లు, ఫ్యూజ్ బాక్సుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎగిసిపడుతున్న మంటలు

మారేడుపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కార్ఖానా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విల్లింగ్టన్ రోడ్డు సికింద్రాబాద్ క్లబ్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ఫ్యూజ్ బాక్సులు సోమవారం అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులకు స్పార్క్ ఏర్పడి ఫ్యూజ్ బాక్సులు పేలి మంటలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎగిసి పడ్డాయి. దీంతో కార్ఖానా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రెండు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వేసవి కావడంతో స్థానిక బస్తీ, కాలనీల్లో ఉంటున్న ప్రజలు ఇబ్బంది పడ్డారు. అర్ధరాత్రి కావడంతో పెను ప్రమాదం తప్పింది. జనాభాకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్ ఫ్యూజ్ బాక్సులను అధికారులు ఏరోజుకారోజు లోడ్‌ను మీటర్ల ద్వారా చెకింగ్ చేసుకోవాలి. ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ ఏ స్థాయిలో ఉంటుందో పరిశీలించాలి. కానీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కింది భాగంలో ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బాక్సులు పేలిందని స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూడాలని కోరుతున్నారు.

గాలి దుమారంవల్ల ప్రమాదం

సోమవారం అర్ధరాత్రి గాలి దుమారంవల్ల విద్యుత్ ఫ్యూజ్ బాక్స్‌లో స్పార్క్ ఏర్పడి మంటలు పెద్దఎత్తున ఎగిసిపడి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినింది. ట్రాన్స్‌ఫార్మర్ పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇక ముందు అన్ని ట్రాన్స్‌ఫార్మర్లను మీటర్ ద్వారా లోడ్ చెకింగ్ చేస్తాం. విద్యుత్ ఫ్యూజ్ బాక్సులు కాలిపోయిన వెంటనే 2గంటల్లోనే విద్యుత్‌ను సరఫరా చేశాం.

- అజయ్‌కుమార్, ఏడీఈ మారేడుపల్లి సబ్ స్టేషన్

షిరిడీ సాయి జయంతి వేడుకలు



అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న అసోషియేషన్ సభ్యులు రవి

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రెజిమెంటల్‌బజార్‌లో బాల గణపతి యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే షిరిడీ సాయి జయంతి వేడుకల్లో మంగళవారం గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్ నరేష్, కంటోన్మెంట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదిత, బీఆర్ఎస్ నాయకులు కర్ణకుమార్ పాల్గొని పూజలు చేశారు. అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నందికంటి రవి, జ్ఞానేశ్వర్, సతీష్, శేఖర్, సాయి, సందీప్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్ఠతకి కృషి చేయాలి



పార్టీ జండాను ఆవిష్కరిస్తున్న శారదా మల్లేష్ తదితరులు

చిలకలగూడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పార్టీ పటిష్ఠతకి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ మహంకాళి జిల్లా, అధికార ప్రతినిధి, దిశ కమిటీ సభ్యురాలు శారదా మల్లేష్ అన్నారు. మెట్టుగూడ డివిజన్ మైలార్‌గడ్డలో మంగళవారం బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా పార్టీ జండాను ఆవిష్కరించారు.

పాత పింఛన్ విధానాన్ని ప్రకటించాలి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ పథకం (ఓపీఎస్)ను ప్రకటించే వరకు దశలవారీగా పోరాటాలకు సిద్ధం కావాలని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి సంఘం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నగరంలో మంగళవారం పీటీఏ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం..

ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా కె.మల్లికార్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శారద, రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శిగా శౌరి, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పార్థసారథి, ప్రభాకర్, చీఫ్ ప్యాట్రన్లుగా కేఎస్ ప్రకాష్‌రావు, బద్రీ నారాయణరావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కాగా, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా వరలక్ష్మి, కార్యదర్శిగా బబితాకుమారి, కోఆర్డినేటర్‌గా లావణ్య, నేషనల్ కౌన్సిలర్‌గా విక్రంభాయిని ఎన్నుకున్నారు.

'బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలి'

ముషీరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బాపూజీ నగర్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటుకు కృషి చేయాలని స్థానిక మహిళలు కాంగ్రెస్ నగర కార్యదర్శి తమగొండ రాజ్‌దీప్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు మంగళవారం బాపూజీ నగర్‌లో రాజ్‌దీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాజ్‌దీప్ మాట్లాడుతూ.. బాపూజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆస్పత్రి ఏర్పాటు విషయాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, మాజీ అధ్యక్షుడు జీఎన్ చారి, సీనియర్ నాయకుడు రమేశ్వరాం తదితరులు పాల్గొన్నారు.

లాల్‌బజార్‌లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు స్వచ్ఛమైన చల్లని మంచి నీరు ఉచితంగా అందించేందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు నాగేని సరిత ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మంగళవారం వార్డ్-7 తిరుమలగిరి టీచర్స్ కాలనీ, లాల్‌బజార్ బస్‌స్టాప్‌లో నాగేని సరిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. వేసవిలో వివిధ పనుల మీద బయటకొచ్చి ప్రజలకు స్వచ్ఛమైన చల్లటి మంచినీరు అందించడానికి కాంగ్రెస్ నాయకులు కంటోన్మెంటు వ్యాప్తంగా వాటర్ క్యాంపులు ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. మరింతమంది దాతలు ముందుకొచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీచర్స్ కాలనీ ప్రెసిడెంట్ బిక్షపతి, కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీ నాయకులు బంగారు సదానంద్, మారుతీగౌడ్, సంతోష్ యాదవ్, వైష్ణవి, రేమండ్, ప్రదీప్, రంజిత్, శ్రీను, మహేష్, సాంసన్ రాజు, నీరజ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో మజ్జిగ పంపిణీ



ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు టింకు గౌడ్, ఉమ

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని ముత్యాలమ్మ ఆలయం ఎదుట ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికులు, పాదచారులు మజ్జిగ తాగి ఎండ నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. కంటోన్మెంట్ బీఆర్ఎస్ యువ నాయకుడు ఆర్. టింకుగౌడ్, బీకే ఉమ, వేణుగోపాలచారితో కలిసి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాజు, శ్రీనివాస్, పద్మ, లక్ష్మి, వసంత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే రాజ్యాంగ పరిరక్షణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సామాన్యులు, ముఖ్యంగా యువతీ, యువకులు, విద్యార్థుల్లో రాజ్యాంగంపై తప్పనిసరిగా అవగాహన కల్పించాలని, అప్పుడే దాని స్ఫూర్తిని కాపాడుకోగలమని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా ఎవరివాటా వారికి అందజేసి సామాజిక, ఆర్థిక అసమానతలను నిర్మూలించడానికి ప్రయత్నాలు సాగించాలని ఆకాంక్షించారు. దళిత స్త్రీశక్తి ఆధ్వర్యంలో మంగళవారం 'రాజ్యాంగ పరిరక్షణ - భవిష్యత్ ప్రణాళిక' అంశంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.ఎమ్ వినోద్‌కుమార్, ఆంధ్రమహిళా సభ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ వసుంధరాదేవి, ప్రొ. రజిత, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ కొండవీటి సత్యవతి, కృష్ణకుమారి తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించుకోవడంలో పౌరుల పాత్ర ప్రధానం అని అన్నారు. కుల, మత, వర్గ వైషమ్యాలకు అతీతంగా సమాజంలో శాంతి, సామరస్యాలు, వర్ధిల్లాలంటే రాజ్యాంగమే శరణ్యమని వక్తలు నొక్కిచెప్పారు. దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ సభాధ్యక్షత న సాగిన ఈ సభలో ఎంవీఎఫ్ ప్రతినిధి వెంకటరెడ్డి, అడ్వకేట్ ప్రకాష్, సాధన తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు క్యాంటీన్ టెండర్ల ప్రక్రియ పూర్తి



బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో క్యాంటీన్ ప్రక్రియలో పాల్గొన్న చైర్మన్ ఆనంద్‌బాబు, సెక్రటరీ వెంకన్న, వైస్ చైర్మన్ దేవేందర్

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో క్యాంటీన్ నిర్వహణకు సంబంధించిన ఓపెన్ టెండరు ప్రక్రియ మంగళవారం ముగిసింది. బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో ఉన్న క్యాంటీన్ కోసం ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ప్రభుత్వం విడుదల చేసిన టెండర్ ప్రక్రియలో దాదాపు నలుగురు బిడ్డర్‌లు పాల్గొన్నారు. ఈమేరకు మంగళవారం మార్కెట్ యార్డు చైర్మన్ ఆనంద్ బాబు కార్యాలయ ఆవరణలో టెండర్ పత్రాలు కార్యదర్శి వెంకన్న ఆధ్వర్యంలో ఓపెన్ చేశారు. ఆ టెండర్లలో రితికేష్ రూ. 2,80,786, సర్వేష్ సింగ్ రూ.2,11,214, సాగర్ సింగ్ రూ.1,90,000, రమేష్ యాదవ్ రూ.1,50,000 తమ తమ టెండర్లు దాఖలు చేశారు. ఈ టెండర్ ప్రక్రియలో అత్యధికంగా కోడ్ చేసిన రితకేష్ సింగ్ టెండర్ దక్కించుకున్నట్టు చైర్మన్ ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్ దేవేందర్‌తో పాటు పాలక మండలి సభ్యుల సమక్షంలో మార్కెట్ యార్డు అధికారి వెంకన్న ప్రకటించారు. గత సంవత్సరం మార్కెట్ యార్డులో క్యాంటీన్ నిర్వహణకు రూ.72వేలు కోడ్ చేసినట్లు, ఈసారి ఎవరూ ఊహించని విధంగా రూ. 2లక్షల 80వేలకు పైచిలుకు టెండర్ వచ్చినట్టు వెల్లడించారు. టెండర్ దక్కించుకున్న వారు ఈ నెల చివరిలో అగ్రిమెంట్ పూర్తయిన మరుసటిరోజు నుంచి వారికి క్యాంటీన్ అప్పగించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు పాలకమండలి సభ్యులు రాజేందర్, సాయి శరత్‌తో పాటు మార్కెట్ యార్డు కార్యాలయం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌ను సందర్శించిన రక్షణ శాఖ జాయింట్ సెక్రటరీ రాకేష్ మిట్టల్



రాకేష్ మిట్టల్‌తో సమావేశమైన బాణుక నర్మద, మధుకర్ నాయక్

సికింద్రాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖ జాయింట్ సెక్రటరీ రాకేష్ మిట్టల్ మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ముఖ్య కార్య నిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద తదితరులతో కలిసి సమావేశమయ్యారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఆయనకు వివరించారు. కాగా కంటోన్మెంట్ అభివృద్ధికి సహకరించాలని రాకేష్ మిట్టల్‌ను బాణుక నర్మద కోరారు. పెండింగులో ఉన్న సర్వీసు చార్జీల బకాయిలు ఇప్పించాలని, వరదనీటి కాల్వల నిర్మాణానికి, సీవరేజీ వ్యవస్థ నిర్మాణానికి ప్రత్యేక నిధులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ప్రవేశపెట్టాలని కోరారు. రక్షణ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ ప్రేమ్‌చంద్, అమొల్ జగ్‌తాప్ తదితర ఉన్నతాధికారులు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

ఏడాదిలో రూ.2,752 కోట్లు విడుదల

- పదేళ్లలో బీఆర్ఎస్ ఇచ్చింది రూ.3,652 కోట్లు మాత్రమే
- మేయర్ విజయలక్ష్మి



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీకి రూ.2,752 కోట్లు విడుదల చేసిందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నగరాన్ని గ్లోబల్ సిటీగా తీరిదిద్దాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో 2014 నుంచి 2023 వరకు రూ.3,652.71 కోట్ల నిధులు విడుదల చేశారని తెలిపారు. ఇందులో రాష్ట్ర ఆర్థిక కార్పొరేషన్ గ్రాంట్లు రూ.1,415.39 కోట్లు, స్టాంప్ డ్యూటీ రూ.1,776.53 కోట్లు, బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో రూ.460.79 కోట్లు విడుదల చేశారన్నారు. ప్రస్తుత సర్కారు 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీకి రూ.6,045 కోట్లు కేటాయించగా.. రూ.2,752 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇందులో బడ్జెట్‌లో కేటాయించిన రూ.2,965.61 కోట్లలో రూ.1552.52 కోట్లు, స్టాంప్ డ్యూటీ రూ.1150 కోట్లు, ఆర్థిక కమిషన్ గ్రాంట్లు రూ.49.36 కోట్లు ఉన్నాయన్నారు.

వెటర్నరీ డాక్టర్‌కు రూ. 1.79లక్షలు టోపీ

- ఆర్మీ డాగ్స్‌కు వైద్యం చేయాలంటూ బురిడీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆర్మీడాగ్స్‌కు వైద్యం చేయాలంటూ నగరానికి చెందిన వెటర్నరీ డాక్టర్‌ను బురిడీ కొట్టించి రూ.1.79లక్షలు సైబర్ క్రిమినల్స్ కొల్లగొట్టారు. ఆ తర్వాత మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన వెటర్నరీ డాక్టర్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తనను తాను ఆర్మీ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. 'మా వద్ద ఆర్మీకి చెందిన 90 కుక్కలు ఉన్నాయి. వాటికి టీకాలు సహా.. అవసరమైన వైద్య పరీక్షలు చేయాల్సి ఉంటుంది. అందుకు అవసరమైన డబ్బును మేమే చెల్లిస్తాం..' అంటూ నమ్మించాడు. మీ ప్రొఫైల్ నచ్చిందని, ఇకపై మీరే మా కుక్కలకు వెటర్నరీ డాక్టర్ అని నమ్మబలికాడు. అయితే, ఆర్మీ నిబంధనల ప్రకారం.. మీకు చెల్లించాల్సిన డబ్బులో 50 శాతం ముందుగానే చెల్లించాల్సి ఉన్నందున పంపిస్తామంటూ వీడియోకాల్ చేసి నమ్మించాడు. మొదట మీరు కొంత నగదు బదిలీ చేయాలని, లావాదేవీ సరిగా ఉందని తేలితే మొత్తం డబ్బులు చెల్లిస్తామని నమ్మబలికాడు. అలా అతని ద్వారా డబ్బులు చెల్లింపులు చేసుకొని, అతని క్రెడిట్ కార్డులోని రూ. 1.79లక్షలు కొల్లగొట్టాడు. ఎంతకీ డబ్బు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



సురేష్ (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వ్యక్తి గత కారణంతో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ రైల్వే స్టేసన్ సమీపంలో మంగళవారం అల్వాల్ రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన సురేష్(49) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



యువతిని కాపాడుతున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాలానగర్ రాజీవ్‌గాంధి నగర్‌కు చెందిన మేరి(36), శ్రీనివాస్ దంపతులు. మంగళవారం సాయంత్రం కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన మేరి హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్యాకు ప్రయత్నించింది. ఆ సమయంలో సమీపంలో ఉన్న ప్రజలు హైడ్రా అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న హైడ్రాలోని డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఘటనా స్థలానికి చేరుకొని తాళ్ల సహాయంతో మేరిని సురక్షితంగా కాపాడి ప్రథమ చికిత్స అందించి, కౌన్సిలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడి మృతి



సత్యనారాయణ(ఫైల్)

బేగంపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బేగంపేటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సి. సత్యనారాయణ గుండె పోటుతో మృతి చెందారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే రూ.4.5 లక్షల ఖర్చు అవుతుందని చెప్పడంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేయించేందుకు నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. నిమ్స్‌లో పరీక్షలు నిర్వహిస్తుండగా మరోసారి గుండె నొప్పి రావడంతో మృతిచెందినట్లు సత్యనారాయణ కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.